క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్: కార్తీక మాసం చివరి మంగళవారం సందర్భంగా పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, పూల అలంకరణ, వడలహారం, నైవేద్యం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సభ్యులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. పూజారి ఆనందాచారి, సభ్యులు రామకృష్ణ, మల్లికార్జునశెట్టి, వెంకయ్యశెట్టి, వీరేశ్, అశోక్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి కరువు మండలంగా ప్రకటించాలి


తహసీల్దార్ వెంకటలక్ష్మితో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ఆదోనిరూరల్: ఆదోనిని పూర్తిస్థాయి కరువు మండలంగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆదోనిలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, ఉపాధి పనులు 200 రోజులు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్, రైతు సంఘం మండలాధ్యక్షుడు శేఖర్, పాండవగల్ సర్పంచ్ కె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఆదోనిఅర్బన్: ప్రతి గ్రామంలో కనీస మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రకాష్‌జైన్, విట్టా రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆదోని మండల పరిధిలోని విరుపాపురం గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ యాత్ర కార్యక్రమం నోడల్ అధికారి, ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో ప్రవేశపెడుతున్న పథకాల గురించి వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులకు తెలియజేశారు. మండల నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌతాళంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు తెలిపేందుకు చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నుంచి కౌతాళంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు.

విజయవంతం చేద్దాం

కౌతాళంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సర్పంచ్ పాల్‌దినకర్, పార్టీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాల్గొంటున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

ఆలూరు రూరల్: మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి మంజునాథ్ సూచించారు. మంగళవారం మొలగవల్లి పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వారం రోజుల పాటు జ్వరం తగ్గకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా రక్త పరీక్ష చేయించాలని చెప్పారు. మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీతో నిరంతరాయంగా సంక్షేమ పథకాలు
- వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం
- ఆరేకల్‌లో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- పాల్గొన్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: గ్రామాల అభివృద్ధి సీఎం వైఎస్ జగనన్ననేతోనే సాధ్యపడిందని, వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఆరేకల్ గ్రామంలో మంగళవారం రెండోరోజూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కొనసాగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతి ఇంటి గడపను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 385 గృహాలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు ప్రజలకు అందుతున్నాయా లేదా మీ సమస్యలు ఏమిటి, ఇక్కడ మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు ఉన్నాయా, అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గడపకు తిరుగుతూ అవ్వ, తాత, అన్న, తమ్ముడు, అక్కా, చెల్లెమ్మ అంటూ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో ప్రతి ఇంటికి రూ.3 లక్షలు వరకు లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆరేకల్ గ్రామ లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.13,26,78,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేయడం జరిగిందని, గ్రామంలో రూ.17 లక్షలతో పాల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కొత్త విద్యుత్ స్తంభాలు 25 మంజూరు చేయడం జరిగిందని, కొత్తగా లైట్లు వేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారందరూ మరోసారి వైఎస్ జగనన్నను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రమేష్, సర్పంచ్ లోహిత వీరస్వామి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, పోలీసు రేణుక, శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పక్కా ఇళ్ల నిర్మాణం


ఆదోనిలో కొనసాగుతున్న ఇంటి నిర్మాణ పనులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో ఇంటి స్థలం లేని నిరుపేదలను గుర్తించి 9,327 మందికి పట్టాలు ఇచ్చారు. అందులో మొదటి విడతగా 5101 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం థర్డ్ పార్టీ వారికి ఇళ్ల నిర్మాణ పనులను అప్పగించింది. కాలనీలో ఇప్పటివరకు 459 ఇళ్లు టాప్ లెవల్ పూర్తి చేసుకోగా, 78 ఇళ్లు రూఫ్ లెవల్, 76 ఇళ్లు లెంటల్ లెవల్‌లోను 3,580 ఇళ్లు బేస్ మట్టం లెవల్‌లో నిర్మాణంలో ఉన్నాయి. మిగతా 908 ఇళ్లు ప్లింత్‌బీమ్, పిల్లర్స్ కాలమ్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణ పనులలో ఎలాంటి జాప్యం చేయకుండా త్వరగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఐరన్, బ్రిక్స్ వంటి వాటిని సమకూర్చిపెట్టారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించి త్వరగా పూర్తి చేయాలని థర్డ్ పార్టీ వారికి సూచిస్తున్నారు. లేబర్ కొరత వంటి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకొని పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హౌసింగ్ ఈఈ రవికుమార్ తెలిపారు.

నేడు భూహక్కు పత్రాల పంపిణీ

కౌతాళం: అర్హులైన లబ్ధిదారులకు అసైన్డ్ భూములకు సంబంధించి శాశ్వత భూహక్కు పట్టాలను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ రామేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలంలో 141 మంది లబ్ధిదారులైన రైతులకు 196 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను బుధవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే 10 సంవత్సరాల క్రితం మండలంలో 75 మంది రైతులకు పంపిణీ చేసిన 90 ఎకరాలకు సంబంధించి శాశ్వత భూహక్కు పత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కులగణన పక్కాగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఏఎస్‌ఓ, ఎంపీడీఓ

కౌతాళం: కుల గణన సర్వేను పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేద్దామని ఏఎస్‌ఓ హేమంతకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కులగణన సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే వల్ల ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సీఎఫ్‌ఎంఎస్ యాప్‌లో లాగిన్ అయ్యి ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా సర్వే చేయాలన్నారు. ఈ సర్వేను ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభించి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరో ఏఎస్‌ఓ కౌసర్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శ్రీనివాసులు

కౌతాళం: సాధరణ పారిపాలనపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఆదోని డీఎల్‌పీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. కార్యదర్శులు పారిపాలన విభాగంలో అన్ని విషయాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. తీర్మానాలపై ప్రజలు ఇచ్చే అర్జీలపై ఎలా స్పందించాలన్న విషయాలను తెలుసుకోవాలన్నారు. పంచాయతీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులు, పన్నులు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మంత్రాలయం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ మణిమంజరి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణలో భాగంగా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, నిధుల ఏర్పాటుపై సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధి కోసం ఆర్థిక వనరులపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఈఓపీఆర్‌డీ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

స్థలం వివాదంలో వ్యక్తిపై దాడి

ఆలూరు రూరల్: స్థలం వివాదంలో శ్రీనివాస్ అనే యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం హత్తిబెళగల్ గ్రామంలో జరిగింది. శ్రీనివాస్ గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు గతంలో సర్వే నంబర్ 932 సీలో 1.50 ఎకరాల స్థలాన్ని గ్రామ పెద్దలు విరాళంగా ఇచ్చారు. అయితే కొందరు వ్యక్తులు ఆ స్థలం తమ కు సొంతమని, పట్టా ఉందని ఆక్రమించుకున్నారు. దీనిపై వలంటీర్ శ్రీనివాస్ బంధువు గాదిలింగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి వలంటీర్‌ను విచారణ చేశారు. స్థలం ఆక్రమించినట్లు ఫిర్యాదు చేస్తావా అంటూ శ్రీనివాస్‌పై గ్రామానికి చెందిన రాజశేఖర్, హరి, చంద్ర, రామకృష్ణ దాడి చేశారు. గాయపడిన శ్రీనివాస్‌ను కుటుంబసభ్యులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు.

'హంద్రీ–నీవా'లో యువతి మృతదేహం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల పరిసరాల్లో ప్రవహిస్తున్న హంద్రీ–నీవా ప్రధాన కాలువలో మంగళవారం మధ్యాహ్నం ఓ యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతురాలు కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం గుమ్మనూరుకు చెందిన శ్యామల (22)గా గుర్తించారు. ఈ నెల 2న ఆమె అదృశ్యమైనట్లు చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిందా? లేక ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంలో వజ్రకరూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ


పత్తికొండలో రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

పత్తికొండ రూరల్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ మొక్కుబడిగా సాగింది. ఉపాధి హామీ ఏపీఓ వెంకటేశ్వర్లు అధ్యక్షతన పత్తికొండ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన సమావేశానికి అంబుడ్స్‌మన్ చంద్రశేఖర్, పీడీ అమరనాథ్ రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ మాధవీలత, ఉపాధి ఏపీడీ పద్మావతి, ఎంపీడీఓ కవిత హాజరయ్యారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సర్వశిక్షాఅభియాన్ కింద రూ.12.13 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయా పనుల రికార్డులను పరిశీలించి రూ.37 వేలు రికవరీ, రూ.36 వేలు పెనాల్టీ కింద చూపించి తనిఖీ బృందం చేతులు దులుపుకున్నారు. తూతూమంత్రంగా జరిగిన సామాజిక తనిఖీపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీపీ నారాయణదాస్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సమగ్రాభివృద్ధి


పెద్దభూంపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


కామవరంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ


సూగూరులో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న భీమారెడ్డి

కోసిగి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన్న గౌడ్, మండల సచివాలయాల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దభూంపల్లి గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంత మేర లబ్ధిపొందారో తెలుపుతూ కరపత్రాలను అందజేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. నాయకులు భీమయ్య, లక్ష్మిరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంట సంక్షేమ పంట పండిందని కామవరం గ్రామ సర్పంచ్ వసంత, మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కామవరం గ్రామంలో ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగనే మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. నవరత్నాల పథకాల వల్ల ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి వివరాలను ఇంటింటికీ వెళ్లి వివరించడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగన్ ఎందుకు అవసరమన్న విషయాన్ని తెలియజేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శివప్ప, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

మంత్రాలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూగూరు గ్రామంలో 'ఏపీకి సీఎం జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. పార్టీ బాధ్యులు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, ప్రగతి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీడీఓ మణిమంజరి, వీఆర్వో జ్యోతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం


అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

- లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, పీసీపీఎన్‌డీటీ చట్టాలపై అవగాహన
- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50 వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష

ఆదోనిరూరల్: సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ భవనంలో భ్రూణ హత్యల నివారణ, పీసీపీఎన్‌డీటీ చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం, గైనకాలజిస్టు డాక్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50 వేలు జరిమానా నుంచి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి అందుతుందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలోని 48 స్కానింగ్ కేంద్రాలను నెలకోసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ మాధవీలత, పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి, డిస్ట్రిక్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో 'రోడ్ సేఫ్టీ' సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత కోసం అధికారులు కృషి చేయాలని, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి, ఆర్టీఓ నాగేంద్ర, ఎంవీఐ సిసిరాదీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, నేషనల్ హైవే ఏఈ శ్రీహరి, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు


మంత్రాలయంలో లబ్ధిదారుడికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు, సింగిల్ విండో ప్రెసిడెంట్ వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంత్రాలయం సచివాలయం–3 పరిధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాఘవేంద్ర నగర్ కాలనీ ఏర్పడి పాతికేళ్లు గడిచినా ఒక్క సీసీ రోడ్డు కూడా లేకపోయిందని, తాము అధికారంలోకి వచ్చాకే అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. కాలనీ మీదుగా వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ తీగల తొలగింపునకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు లేని పేదలకు సైతం రెండో విడత కింద పట్టాలు అందజేస్తామన్నారు. పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచు పరమేష్, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, మల్లికార్జున, ఎంపీడీఓ మణిమంజరి, ఏఓ జీరా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'దీపం' గ్యాస్ సిలిండర్ల పంపిణీ


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు వెల్లాల మధుసూదనశర్మ

ఆదోనిఅర్బన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు పంజరాపోల్ కాలనీలో దీపం పథకం ద్వారా మంజూరైన ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్టౌవ్, రెగ్యులేటర్‌లను మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు వెల్లాల మధుసూదనశర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా ఇంతవరకు రేషన్‌కార్డు లేదా ఆధార్‌కార్డు ద్వారా గ్యాస్ కనెక్షన్ లేకుండా ఉంటారో అటువంటి వారందరూ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుపేద మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు కురువ రవికుమార్, అబ్రహం, అగ్గి రాముడు, తిక్కన్న, సులోచనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు తగదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా

ఆదోనిసెంట్రల్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ ఆదోని పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర ఆదోనికి వచ్చి మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆదోనిలో కొంతమంది పిలుపు మేరకు బీసీవై పార్టీ నాయకుడు వచ్చాడని, ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవి విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పుట్టుకతోనే శ్రీమంతులు అని వారిది భూస్వాముల కుటుంబం అని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి వాడ, గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఇదంతా ఎమ్మెల్యే కృషితో సాధ్యమైందని వివరించారు. వైఎస్సార్‌సీపీపై విషం చిమ్ముతూ మీడియా ముందు పిచ్చి కూతలు కూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

అమ్మవారికి ఆభరణాల విరాళం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి గ్రామదేవత రేణుకా ఎల్లమ్మకు పట్టణానికి చెందిన వడ్ల సుబ్బరాయుడు మంగళవారం ఆభరణాలను విరాళంగా అందించారు. రూ.1.60 లక్షల విలువచేసే బంగారు జుంకీలు, వెండి వస్తువులను అర్చకులు ఓమేంద్ర, ఎల్లయ్య సమక్షంలో అమ్మవారికి అలంకరించి, కుటుంబ సభ్యులు రాము, శ్రీహరితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ మోటార్ చోరీ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించి మోటార్‌ను దొంగిలించినట్లు మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గుర్తించి ఉపాధ్యాయులకు సమాచారం అందజేశారు. ఘటనపై హెచ్‌ఎం మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కర్ణాటకకు వెళ్లి పింఛన్ పంపిణీ


కర్ణాటకలో ఉన్న మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ జె.భంభం బాషా


కర్నూలులో చికిత్స పొందుతున్న గిడ్డన్నకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ సుంకమ్మ

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్‌కు చెందిన బోయ అంజనమ్మకు ఆ గ్రామ వలంటీర్ జె.భంభం బాష మంగళవారం కర్ణాటకకు వెళ్లి పింఛన్ అందజేశాడు. అంజనమ్మ 20 రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా షాపూరు మండలం గోమారి గ్రామానికి పత్తి తోటలలో పనికి వెళ్లింది. గ్రామ వలంటీర్ బాషా ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని 245 కి.మీలు ప్రయాణించి వెళ్లి ఆమెకు పింఛన్ సొమ్ము రూ.2,750 అందించాడు. ఉన్న చోటికే వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారాలు హర్షం వ్యక్తం చేస్తూ వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని ఆర్.మండగిరి గ్రామానికి చెందిన ఆరెకంటి గిడ్డన్న రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో లేవలేని స్థితిలో కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ సుంకమ్మ మంగళవారం కర్నూలుకు వెళ్లి పింఛన్ అందించి ప్రశంసలు పొందారు.